కప్పు.. ప్రత్యేకమే..



కాఫీకి ఎంత గుర్తింపు ఉందో అది తాగే కప్పుకీ అంతే క్రేజ్ ఉంది. పూర్వం కాఫీ ఇత్తడి చెంబుల్లో తాగేవారు. తర్వాత లోటాల్లో.. ఆ తర్వాత మట్టి, స్టీలు, గాజు, పింగాణీ కప్పులు.. కప్పుసాసర్‌లో కొంతకాలం.. ఇప్పుడు కాఫీ కప్పులంటేనే వేలల్లో మోడళ్లు. కాఫీ తాగాలంటే తనకంటూ సొంతంగా ఓ కప్పు ఉండితీరాల్సిందే. రుచిగా కాఫీ తాగడమే కాదందోయ్.. అభిరుచి మేరకు తాగే కప్పు ప్రత్యేకమేనని కాఫీప్రియుల ఉవాచ.



ఈ బస్‌లు వస్తున్నాయ్!

ఉమ్మడి జిల్లాలో ఎలక్ట్రికల్ బస్సులు పరుగు

ఇప్పుడంతా ఈవీ(ఎలక్ట్రికల్ వాహనాల)ల శకం నడుస్తోంది. కాలుష్య నియంత్రణలో భాగం గా ఎలక్ట్రికల్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో ఇప్పటికే ఎక్కడ చూసినా ఈ-బైక్ హవా కనిపిస్తోంది.ఖర్చు భారీగా తగ్గుతుందనే కారణంతో వ్యక్తులు, కంపెనీలు ఈ-వాహనాల వైపే ఎక్కువగా మొగ్గుచూపు తున్న పరిస్థితి. ఈ బాటలోనే ఆర్టీసీ కూడా పయనిస్తోంది. ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయాలని నిర్ణయించు కుంది. ఇప్పటికే తిరుపతి, విజయవాడ లాంటి ప్రాంతాల్లో ఆర్టీసీ వీటిని నడుపుతోంది.

- ఆర్టీసీకి 150 కొత్త బస్సులు
- ఒక్కో బస్సురూ.1.50 కోట్ల ఖర్చు
- రూ.225 కోట్లతో కొనుగోలు
- కాకినాడ జిల్లాకు 50
- తూర్పుగోదారి జిల్లాకు 100
- 3 జిల్లా రూట్లలో తిప్పేలా ప్లాన్
- 25 వరకు ఛార్జింగ్ స్టేషన్లు
- భారీగా ఖర్చు ఆదా అని అంచనా
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో ఇప్పటివరకు ఎలక్ట్రికల్ బస్సులు లేవు. దీంతో దూరప్రాంత రూట్లకు ఇంధనంతో నడిచే బస్సులే కాకుండా భవిష్యత్తులో ఈవీ బస్సులు నడిపేందుకు ఆలోచిస్తోంది. తద్వారా ఇంధనం ఆదా కూడా భారీగా ఆదా అవుతుందని భావిస్తోంది. ఈనేపథ్యంలో రూ.225 కోట్లతో కాకినాడ, రాజమహేంద్రవరం డిపోలకు 150 కొనుగోలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 చొప్పున అవసరమని రాష్ట్రప్రభుత్వానికి ఆర్టీసీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ముఖ్యంగా కాకినాడ-రాజమహేంద్రవరం, కాకినాడ-అమలాపురం, కాకినాడ-తుని, అటు రాజమహేంద్రవరం-కాకినాడ, రాజమహేంద్రవరం- అమలాపురం రూట్లలోను వీటిని తిప్పాలని భావిస్తోంది. ఒక్కో బస్సుకు రూ.1.50కోట్ల వరకు ఖర్చవుతుందని అధికారులు ఇప్పటికే అంచనా వేశారు. వీటికోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 25 వరకు ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు.

ఎలక్ట్రిక్ పరుగులతో లాభాల పంటే..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నగరాలు, పట్టణాలు, గ్రామాల మీదుగా వందలాది బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. ఇంద్ర, డాల్ఫిన్ ఏసీ బస్సులనుంచి సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, పల్లెవెలుగు వరకు వందలాది రూట్లలో వీటిని నిత్యం నడుపుతోంది. ఇప్పటికే డీజిల్ ధరలు పెరగడంతో నానాటికీ నిర్వహణ వ్యయం తడిసి మోపెడవుతోంది. దీంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఆర్టీసీ చవిచూస్తోంది. ఈ నేపథ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికుల సర్వీసుల్లోను కొత్త పద్ధతులు అనుసరించాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఖర్చులను కూడా నియంత్రించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అంటే ఎప్పుడో కాలం చెల్లిన బస్సులు అనే పేరు పోగొట్టుకునేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తోంది.

ఉమ్మడి జిల్లాకు 150 బస్సులు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్త బస్సుల కొనుగోలు, రద్దీ రూట్లలో సర్వీసుల పెంపు వరకు అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. గత వైసీపీ సర్కారు ఆర్టీసీని పూర్తిగా నిర్వీర్యం చేయడంతో కొత్త బస్సుల కొనుగోలు, అదనపు రూట్లు అన్నీ దాదాపు అటకెక్కాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆర్టీసీకి అన్ని విధాలా సహకారం అందిస్తుండడంతో ప్రయాణికులకు దగ్గరయ్యేందుకు త్వరలో ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతోంది. తద్వారా ఖర్చు తగ్గించుకోవడంతోపాటు ఆధునిక రవాణాను అందిపుచ్చుకున్నట్లు అవుతుందని భావిస్తోంది. అందులోభాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు 150 భారీ ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేయడానికి సమాయత్తమవుతోంది. తొలివిడత కాకినాడ జిల్లాకు 50, తూర్పుగోదావరి జిల్లాకు 100 బస్సులను కొనుగోలు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఇటీవల రవాణాశాఖ మంత్రి రాజమహేంద్రవరం వచ్చినప్పుడు అధికారులతో ఈ విషయంపై చర్చ జరిగింది. ఉమ్మడి జిల్లాకు తొలివిడత కింద 150 బస్సులు అవసరమని అధికారులు వివరించారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినట్లు తెలిపారు.

మలిదశలో అమలాపురానికి..

వాస్తవానికి ఒక్కో ఎలక్ట్రికల్ బస్సు ధర రూ.1.50కోట్లు. వీటిని ప్రఖ్యాత కంపెనీలనుంచే కొనుగోలు చేయబోతున్నారు. పైగా వీటిలో ఆధునిక సౌకర్యాలన్నీ ఉంటాయి. ఈ లెక్కన 150 బస్సులకు రూ.225కోట్ల వరకు ఖర్చవనుంది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో 150 ఎలక్ట్రికల్ బస్సులను ఏయే రూట్లలో తిప్పాలనేదానిపై ఇప్పటికే అధికారులు కసరత్తు పూర్తిచేశారు. కాకినాడ జిల్లా కేంద్రం డిపో నుంచి నడపనున్న 50 బస్సుల్లో కొన్ని కాకినాడ-అమలాపురం, కాకినాడ-రాజమహేంద్రవరం, కాకినాడ-తుని రూట్లలో నడపాలని భావిస్తున్నారు. రాజమహేంద్రవరం డిపోనుంచి కాకినాడ, తుని, అమలాపురం, ఏలూరు, విశాఖ వరకు నడపాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు రూట్లవారీగా ఎక్కడెక్కడకు ఎలక్ట్రికల్ సర్వీసులు నడపాలనేదానిపై పూర్తినివేదిక తయారు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు మలిదశలో కొత్త బస్సులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

టికెట్ ధరలు తగ్గే అవకాశం

రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల నుంచి కూడా ఎలక్ట్రికల్ బస్సుల ప్రతిపాదనలు వెళ్లడంతో అన్నీ కలిపి ఒకేసారి టెండర్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు ఆలోచిస్తోంది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాదిలోగా ఈ సర్వీసులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. టికెట్ ధరలు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. కాగా 150 ఎలక్ట్రికల్ బస్సుల కోసం ఛార్జింగ్ స్టేషన్లకు కూడా భారీగా ఖర్చవుతుందని భావిస్తున్నారు. హైస్పీడ్‌తో కూడిన ఛార్జింగ్ కేంద్రాలను 25 వరకు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, తునిలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి బ్యాటరీ బైక్‌కు కనీసం ఆరు గంటల వరకు ఛార్జింగ్ చేస్తేనేగానీ బ్యాటరీఫుల్ కాదు. కానీ రాబోయే ఎలక్ట్రికల్ బస్సులకు రెండు గంటలు ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ ఫుల్ కానున్నాయి. కొత్త ఎలక్ట్రికల్ బస్సులు భారీ బ్యాటరీ సామర్థ్యంతో తయారవుతాయి కాబట్టి రోజులో ఒకసారి ఛార్జింగ్ చేస్తే సరిపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

నేడే పింఛన్ల పంపిణీ

- జిల్లావ్యాప్తంగా 2,75,679మంది పింఛన్‌దారులు
- మొత్తం రూ.116 కోట్లు విడుదల
- తొలిరోజు నూరుశాతం పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 30: జిల్లాలో 2,75,679మంది పింఛన్ దారులకు రూ.116కోట్లు నిధులు విడుదల చేశారు. మంగళవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. తొలిరోజే నూరుశాతం పింఛన్ల పంపిణీ చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. దీనిలో గండేపల్లి మండలం రూ.3.62కోట్లు, గొల్లప్రోలు రూ.3.29కోట్లు, గొల్ల ప్రోలు అర్బన్ రూ.1.23కోట్లు, జగ్గంపేట రూ.5.20కోట్లు, కాజులూరు రూ.4.16 కోట్లు, కాకినాడ రూరల్ రూ.7.62కోట్లు, కాకినాడ అర్బన్ రూ.12.75కోట్లు నిధులు ఇచ్చారు. కరప రూ.4.80కోట్లు, కిర్లంపూడి రూ.4.79కోట్లు, కోటనందూరు రూ.3.30కోట్లు, కొత్తపల్లి రూ.5.19కోట్లు, పెదపూడి రూ.4.28కోట్లు, పెద్దాపురం రూ.4.90కోట్లు, పెద్దాపురం అర్బన్ రూ.2.58కోట్లు పిఠాపురం రూ.4.63కోట్లు, పిఠాపురం అర్బన్ రూ.4.43కోట్లు, ప్రత్తిపాడు రూ.4.94కోట్లు, రౌతులపూడి రూ.3,41కోట్లు, సామర్లకోట రూ.4.87కోట్లు, సామర్లకోట అర్బన్ రూ.2.71కోట్లు నిధులు విడుదల చేశారు.

నేడు ఇంటర్నేషనల్ కాఫీ డే

కాస్త.. ఫీలింగ్!

కా..ఫీ.. అంటే కాస్త ఫీలింగ్. ఉదయాన్నే పొగలు కక్కే చిక్కటి కాఫీ రుచి చూడనిదే చాలామందికి రోజు ఆరంభమే కాదు. కాఫీ గొంతులో పడనిదే మంచం దిగని వారెందరో. ఇదేంటి పొద్దున్నే అన్నామనుకోండి.. బెడ్ కాఫీ మహిమ మీకేం తెలుసంటారు. రిఫ్రెష్ అవ్వాలంటే కాఫీ ఒక్కటే మందు అని వాదించే కాఫీ క్లబ్ బ్యాచ్‌లూ ఉన్నాయి. ఇదివరకు కాఫీ అంటే ఫిల్టర్ కాఫీ ఒక్కటే. అంత సమయం లేదండీ.. అనుకునే వాళ్లంతా ఇన్‌స్టెంట్ కాఫీ రుచులను ఆస్వాదిస్తుంటారు. ఇప్పుడు ఈ కాఫీలు ఓల్డ్. ట్రెండ్‌కు అనుగుణంగా కాఫీ రకాలెన్నో వచ్చేశాయి. బ్లాక్ కాఫీ, కోల్డ్ కాఫీ, చాక్లెట్ కాఫీ.. ఇంకా చాలా ఉన్నాయ్. ఓసారి కాఫీడేకో, మరో కాఫీషాప్‌కో వెళితే ఇవన్నీ కాఫీలేనా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. నేడు కాఫీ డే సందర్భంగా ఒక్కసారి ఆ కాఫీ రుచి చూసేద్దాం.. కాస్త.. ఫీలింగ్ ఆస్వాదిద్దాం!





- కొత్త కొత్త రకాల్లో కాఫీ
- కాఫీ సాగు కేరాఫ్ మన్యం

కాఫీ.. ఉషోదయాన ఉత్తేజం కలిగించే గమ్మత్తైన పానీయం. కాఫీ.. అనే రెండక్షరాల పదం వినగానే ప్రాణం లేసొచ్చిందనే నానుడి వింటూనే ఉంటాం. ఇష్టాయిష్టాలు చాలామందివి కలుస్తూ ఉండొచ్చుగానీ, కాఫీప్రియులకు పెద్దగా పరిచయాలతో పనిలేదు. ఎవరినైనా ముచ్చట్లలో ముంచెత్తేంతగా దగ్గర చేసేది కాఫీ మాత్రమే. అందుకే కాఫీ కబుర్లు అని దానికో నిక్‌నేమ్ పెడుతుంటారు. పెద్ద పెద్ద చర్చలు కూడా కాఫీ టేబుల్ దగ్గరే జరుగుతుంటాయనీ వింటుంటాం. కాఫీ చెట్ల నుంచి లభించే గింజలను శుద్ధి చేసి ఎండబెట్టి, పొడి చేసి కాఫీ తయారీకి వినియోగిస్తారని తెలిసిందే. అనేక దేశాల్లో కాఫీ పంటను సాగుచేస్తుండగా, మన మన్యంలో కూడా కాఫీ సాగు ఎప్పుడో మొదలైంది. 1898లో బ్రిటిష్ అధికారి 'బ్రాడీ' తూర్పు కనుమల పరిధిలోకి వచ్చే మన ఏజెన్సీ మారేడుమిల్లి దగ్గర పాములేరు లోయలో కాఫీ పంట సాగులోకి వచ్చిందని చెబుతారు. ఇక్కడి నుంచే అరకు ప్రాంతానికి సాగు విస్తరించింది. నిజానికి ఇతర దేశాల్లో కాఫీ గింజలను వేయించి, పొడిచేసి దాన్ని నీటితో మరిగించి, ఆ నీటిని వడగట్టి కాఫీ డికాక్షన్ తయారుచేసి పంచదారను చేర్చి తాగేవారు. మనవాళ్లు మాత్రం కాఫీ డికాక్షన్‌కు పాలను చేర్చి చిక్కటి కాఫీ తాగడం కొత్త అలవాటు. ఇక వేడివేడి పొగలు కక్కే కాఫీ తాగడం పాత సంప్రదాయం. చల్లని ఐసు ముక్కలతో కూడిన కోల్డ్ కాఫీలను ఆస్వాదించడం కొత్త అలవాటు. అయినా ఎవరి టేస్టు వారిది.. ఎవరి ట్రెండ్ వారిది.

ఆంధ్రా ఫేమస్ శొంఠి కాఫీ

రాజమహేంద్రవరం సిటీ : కాఫీలు పలు రకాలు. పూర్వం శొంఠి బెల్లం కాఫీ అనే రకం అందులో ఒకటి. విదేశాల నుంచి తెచ్చిన కాఫీ గింజలతో కాఫీ తాగడం మొదలుకాక ముందు నుంచే ఈ శొంఠి కాఫీ వినియోగంలో ఉందని చెబుతారు. వంటింట్లో లభించే సుగంధాలతోనే దీన్ని తయారుచేయడంలో మన అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధహస్తులు. శుభ్రపరిచిన శొంఠి 20 గ్రాములు తీసుకుని దాన్ని మిక్సీలో వేసి మెత్తని పౌడరుగా తయారుచేసుకోవాలి. అలాగే 10 గ్రాములు మిరియాలు తీసుకుని దాన్ని కూడా మెత్తగా తయారుచేసుకోవాలి. అదేవిధంగా 10 గ్రాముల బెల్లం తీసుకుని దాన్ని మెత్తగా తయారుచేసి గిన్నెలో ఉంచాలి. రెండు కప్పుల నీరు గిన్నెలో పోసి స్టౌవ్‌పై పెట్టి దాన్ని మరిగించి శొంఠి, మిరియాల మిశ్రమాన్ని వేసి మరిగించాలి. ఐదుని మిషాలలోపు మరిగించి దానిని వడిగట్టి మరొక గిన్నెలో వేయాలి. తర్వాత రెండు కప్పుల పాలను తీసుకుని స్టౌవ్‌పై మరిగించి దానిని దించే ముందు శొంఠి ద్రావణాన్ని పాలలో వేసి వెంటనే బెల్లంపొడి వేసి కలిపి స్టౌ కట్టేసి దాన్ని దించి గ్లాస్‌లో తొరిపి తాగేయడమే. శొంఠి కాఫీ తాగడం వల్ల దగ్గు, జలుబు, శ్వాస సమస్యలు తగ్గుతాయని, జీర్ణశక్తి పెరుగుతుందని చెబుతారు మరి.

కాఫీ కాస్ట్‌లీ.. టేస్టీ



కార్పొరేషన్(కాకినాడ) : కాఫీలో రకరకాల ఫ్లేవర్లు, కొత్త రుచులను నేటి తరం ఆస్వాదిస్తోంది. ఉమ్మడి తూర్పు పరిధిలో కొత్తరకం మెట్రో కాఫీ షాపులు వెలిశాయి. మనకి మార్కెట్‌లో లభ్యమయ్యే కాఫీలు వేరు.. ఇక్కడ దొరికేవి వేరు. ఇక్కడ ఉండే హాట్, కోల్డ్, వెరైటీ కాఫీ రుచులు, వాటి ధరలు...

క్యాపిచినో	- రూ.238(350ఎంఎల్)
కాఫీ లట్టే	- రూ.248(350ఎంఎల్)
ఎస్ప్రెస్సో	- రూ.152(30ఎంఎల్)
డబుల్ ఎస్ప్రెస్సో	- రూ.210(60ఎంఎల్)
క్లాసిక్ అఫోగతో	- రూ.257(120ఎంఎల్)
ఫ్లేవర్డ్ అఫ్గోటాస్	- రూ.276(150ఎంఎల్)
హనీ సిన్నమోన్ కాఫీ	- రూ.200(180ఎంఎల్)
మోచా కాఫీ	- రూ.238(210ఎంఎల్)
ఐరిష్ కాఫీ	- రూ.248(200ఎంఎల్)
సిగ్నేచర్ కోల్డ్ కాఫీ	- రూ.257(300ఎంఎల్)
డెవిల్స్ ఒరిజినల్ కాఫీ	- రూ.310(350ఎంఎల్)



మన్యం కాఫీకి.. మహా డిమాండు

కాఫీ అంటే గుర్తొచ్చే మన బ్రాండ్ అరకు కాఫీ. ఈ కాఫీకి ఇప్పుడు అంతర్జాతీయంగా మంచి మార్కెట్ ఉంది. అందులోనూ కావేరీ రకం కాఫీకి చాలా డిమాండు ఉంది. గిరిజన సహకార సంస్థ అరకు బ్రాండ్ పేరుతో ఈ కాఫీ పొడిని మార్కెట్ చేస్తోంది. దేశంలో కేరళ తర్వాత కాఫీ పంటకు మన రాష్ట్రంలోని తూర్పుకనుమలు ప్రత్యేకమైనవి. సముద్రమట్టానికి వెయ్యి నుంచి 1250 అడుగుల ఎత్తున ఉండి తోటల పెంపకానికి అనువుగా ఉంటుంది. అల్లూరి జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాంతంలో కేంద్రం కాఫీ ప్రాజెక్టుకు ప్రోత్సాహాన్నిచ్చింది. మారేడుమిల్లి, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాలు సముద్రమట్టానికి 1200 నుంచి 1500 అడుగుల ఎత్తులో ఉండడంతో ఇక్కడ కాఫీ తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా రంప మన్యంలో కావేరీ రకం పంట హెక్టారుకు 3వేల కిలోల ముడి కాఫీ పిక్కలను ఇస్తోంది. కాఫీ మొక్క సాధారణంగా ఆరో ఏట నుంచి దిగుబడిని ఇస్తుంది. ఆరేళ్లపాటు ఎకరాకు మొత్తం రూ.28 వేలు మాత్రమే ఖర్చవుతుంది. ఏజెన్సీలో ఒక్క మారేడుమిల్లి మండలంలో మాత్రమే ఇప్పుడు సుమారు 300 ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. జీసీసీ మార్కెటింగ్ చేసే అరకు బ్రాండ్ కాఫీలో ఇక్కడ పండించిన కాఫీ కూడా చేరుతోంది. 2007-08 సంవత్సరంలో గిరిజన సంక్షేమశాఖ రంపచోడవరం ఐటీడీఏకు 12 వేల ఎకరాల్లో కాఫీ అభివృద్ధికి రూ.28 కోట్లు కేటాయించింది. అయితే ఆ దిశగా ఐటీడీఏ సరైన ప్రణాళిక అమలు చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు అమలుకు నోచుకోలేదు. ఆ నిధులూ మురిగిపోయాయి. కాఫీ సాగుకు పూర్తి అనుకూలమైన మారేడుమిల్లి మండలంలో సుమారు 20వేల ఎకరాల భూమి రైతుల చేతిలో ఉండగా ఇందులో కేవలం 30 నుంచి 50 శాతం భూములు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. ఆయా భూముల్లోను, గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూముల్లోనూ వారికి ఆదాయాన్నిచ్చే కాఫీ పంటను ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు రావడం ఖాయం. - రంపచోడవరం



పిఠాపురంలో ప్రజలనుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్

వినతులను సత్వరం పరిష్కరించాలి: కలెక్టర్

పిఠాపురం, సెప్టెంబరు 30: ప్రజల నుంచి అందిన వినతులను ఫిర్యాదుదారులు సంతృప్తి చెందే రీతిలో సత్వరం పరిష్కరించాలని కలెక్టరు షాన్‌మోహన్ ఆదేశించారు. పిఠాపురం పట్టణ రథాలపేట సెంటర్‌లోని అంబేడ్కర్ మల్టీపర్పస్ కమ్యూనిటీహాలులో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. నియోజకవర్గం ప్రజలనుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి ఆదేశాలు ఇచ్చారు. ఏలేరు వరదల్లో పంటలు పూర్తిగా కోల్పోయినా తమకు నష్టపరిహారం అందలేదని, ఇసుకమేటలు వేసినా సక్రమంగా నమోదు చేయాలని రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి.

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 30: కాకినాడ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఇతర అధికారులతో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్‌మీనా మాట్లాడుతూ ప్రజాఫిర్యాదుల వ్యవస్థద్వారా మొత్తం 385 అర్జీలు అందాయన్నారు. వీటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు.హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డీపీఎం లావణ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: ఎస్పీ

కాకినాడ క్రైం, సెప్టెంబరు 30: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీసుకార్యాలయంలో సోమవారం 82మంది నుంచి అర్జీలు స్వీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ఏఎస్పీ భాస్కరరావు, డీటీఆర్‌బీ సీఐ గౌరీశంకర్ పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుల సమస్య వింటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఇకపై.. ఒక్కరే ఎంఈవో!

- ప్రభుత్వం నిర్ణయం.. డీఈవోకు సమాచారం
- గత ప్రభుత్వ విధానానికి స్వస్తి



పెద్దాపురం,సెప్టెంబరు 30: మండలానికి ఇద్దరు విద్యాశాఖాధికారుల విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనుంది. గతంలో మాదిరిగా ఎంఈవో ఒక్కరే ఉంటారు. పాఠశాలల్లో విద్యాబోధనను పర్యవేక్షించడానికి స్కూల్ కాంప్లెక్స్‌ల వ్యవస్థను పటిష్ఠం చేసి అక్కడ హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు అప్పగించనున్నారు. గతంలో మండలానికి ఒక ఎంఈవో ఉండేవారు. విద్యాబోధన, టీచర్ల సర్వీస్ వ్యవహారాలు, ప్రభుత్వ పథకాలు అమలు తీరును పర్యవేక్షించేవారు. ఎంఈవోకు పనిభారం ఎక్కువగా ఉందని భావించిన గత పాలకులు ప్రతిమండలానికి రెండో ఎంఈవో పోస్టును కేటాయించారు. ఎంఈవో-1గా ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంలు, ఎంఈవో-2గా జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంల్లో సీనియర్లకు అవకాశం కల్పించారు. మండలంలో పాఠశాలల పర్యవేక్షణ కంటే ఇద్దరు ఎంఈవోల మధ్య ఆధిపత్య పోరే ఎక్కువగా ఉండేది. పలుచోట్ల ఇద్దరు ఎంఈవోల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం జరిగిన సందర్భాలున్నాయి. కొన్నిగ్రామీణ ప్రాంతాల్లో ఇద్దరు ఎంఈవోల మధ్య వివాదాలు ఎక్కువగా ఉండడంతో కొత్త ప్రభుత్వం మండలానికి ఒకరిని మాత్రమే ఉంచాలని సూత్రప్రాయంగా నిర్ణయానికి వచ్చింది. ఇప్పటికే ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. ఒక్క ఎంఈవో కొనసాగించనున్న నేపథ్యంలో విద్యా బోధన, పాఠశాలలపై పర్యవేక్షణ బాధ్యత స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించనున్నారు.

హెచ్‌ఎంలకు కీలక బాధ్యతలు

కాకినాడ జిల్లాలో 1281 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 94 స్కూల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. పది వరకూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు అందుబాటులో ఉంటూ అన్ని సదుపాయాలున్న ఉన్నత పాఠశాలలను స్కూల్ కాంప్లెక్స్‌లుగా పరిగణిస్తుంటారు. తాజా నిర్ణయంతో వీటి సంఖ్య స్వల్పంగా తగ్గుతుందని చెబుతున్నారు. మారుమూల ప్రాంతంలో ఉన్న స్కూల్‌కాంప్లెక్స్ బాధ్యత అందుబాటులో ఉన్న ఉన్నత పాఠశాలకు అప్పగించనున్నారు. తాజా నిర్ణయంతో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఎక్కువ అధికారాలు అప్పగించనున్నారు. ఎస్టీటీలకు సంబంధించి సర్వీస్ వ్యవహారాలు, సెలవుల మంజూరు అధికారాలు కట్టబెడతారు. ఇక ఎంఈవోలను పాఠశాలల తనిఖీ బాధ్యతల వరకే పరిమితం చేయనున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాల్సి ఉందని, దీనికి సంబంధించిన పూర్తి విధివిధానాలు వచ్చిన తర్వాత అమలు చేసే అవకాశం ఉంటుందని డీఈవో పి.రమేష్ తెలిపారు.

'నీటి చౌర్యం'పై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం

- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 30: కాకినాడ కార్పొరేషన్ 2వ డివిజన్ బొందగుంటలో అక్రమ నీటి చౌర్యానికి పాల్పడుతున్న సంఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి నివేదిక అందజేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. 'నీటి చౌర్యం' శీర్షికతో సోమవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించి ఈ విషయమై సమగ్ర విచారణ చేపట్టాలని నగరపాలకసంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు సరఫరా అవుతున్న తాగునీటిని అక్రమంగా చౌర్యానికి పాల్పడుతున్నదీ, లేనిదీ క్షేత్రస్థాయిలోకి ఇంజనీరింగ్ అధికారులతో విచారణ చేయించాలని ఆదేశించారు. అనధికారికంగా ప్లాంట్ల నిర్వహణ, ప్రభుత్వ అనుమతులు తదితర వివరాలను పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉప్పాడ తీరప్రాంత రక్షణకు చర్యలు

- రూ.200కోట్లతో కేంద్రానికి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు
- త్వరలో నిధులు విడుదల

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 30: జిల్లాలో ఉప్పాడ సముద్ర తీర ప్రాంత రక్షణకు వాల్ నిర్మించడానికి నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీకి ప్రతిపాదనలు వెళ్లాయి. ఉప్పాడ తీరంవల్ల కోతకు గురికాకుండా ఉండేందుకు రూ.200కోట్లు కావాలని కలెక్టర్ షాన్‌మోహన్ ప్రతిపాదనలు పంపారు. నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ శాస్త్రవేత్తల బృందం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఉప్పాడ తీరంలో రక్షణ గోడ నిర్మాణానికి నిధులు కావాలని కేంద్రాన్ని కోరారు. త్వరలో ఈ నిధులు విడుదలయ్యే అవకాశాలున్నట్లు అధికారుల ద్వారా తెలిసింది. ఉప్పాడ సముద్ర తీరంలో వచ్చే ఆటుపోటులవల్ల 30ఏళ్లుగా తీరం భారీగా కోతకు గురైంది. ఎస్‌పీజీఎల్ పరిశ్రమ నుంచి మాయాపట్నం వరకు 4 కిలోమీటర్ల వరకు కోతకు గురైంది. పైగా 2కిలోమీటర్ల మేర సముద్రం ముందు కొచ్చింది. దీనివల్ల ఉప్పాడతోపాటు సమీప గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలంలో సముద్రపు నీరు రోడ్లపైకి వచ్చి రోడ్లు ధ్వంసమవుతున్నాయి. పైగా పంటపొలాలు సైతం ముంపునకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో చెన్నైకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ శాస్త్రవేత్తల బృందం ఉప్పాడలో పర్యటించి పలు సూచనలు చేశారు. దీని ఆధారంగా రూ.200కోట్లు కావాలని కేంద్రానికి ప్రతిపాదనలు వెళ్లాయి. దీనిపై డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కేంద్రంతో సంప్రదింపులు చేస్తున్నారు. ఎట్టి పరిస్థితిలో నిధులు మంజూరు చేయించి శాశ్వత ప్రాతిపదికన తీరంలో రక్షణ గోడ నిర్మించి ఉప్పాడ తీరాన్ని సంరక్షించాలని కృత నిశ్చయంతో ఉన్నారు.

పంతం నానాజీ, రఘురామకృష్ణంరాజులను సస్పెండ్ చేయాలి



కలెక్టరేట్ వద్ద ఆత్మగౌరవ దీక్ష చేపట్టిన దళిత నాయకులు

- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాలమహానాడు జిల్లా జేఏసీ
- జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దళిత ఆత్మ గౌరవ దీక్ష

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 30: జనసేన పార్టీకి చెందిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పశ్చిమగోదావరి జిల్లా ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజును జనసేన, టీడీపీల నుంచి సస్పెండ్ చేయాలంటూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాలమహానాడు కాకినాడ జిల్లా జేఏసీ డిమాండ్ చేస్తూ సోమవారం కాకినాడ జిల్లా కలెక్టరు వారి కార్యాలయం వద్ద దళిత ఆత్మ గౌరవ దీక్ష చేపట్టారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాలమహానాడు కాకినాడ జిల్లా జేఏసీ ఛైర్మన్ సిద్దాంతపు కొండబాబు, మాలమహానాడు రాష్ట్ర జేఏసీ నాయకులు పండు అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అగ్రవర్ణాలకు చెందిన రఘురామకృష్ణంరాజును,పంతం నానాజీలపై చర్యలు తీసుకోవడంలేదని, అగ్రవర్ణాలకు ఒకన్యాయం, దళితులకు ఒక న్యాయమా అంటూ ప్రశ్నించారు. రాష్ట్ర డాక్టర్ల సంఘ అధ్యక్షుడు డాక్టర్ జయధీర్ సంఘీభావం తెలిపారు. దీక్షలో పాల్గొన్నవారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మాలమహానాడు జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్, ఉపాధ్యక్షులు ఏనుగుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

'నన్నయ' బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా సుబ్బారావు

దివాన్‌చెరువు, సెప్టెంబరు 30: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ (బీఓఎస్) చైర్మన్‌గా విద్యా కళాశాల చైర్మన్ ఆచార్య కె.సుబ్బారావు నియమితులయ్యారు. సభ్యులుగా శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ టీజీ అమృతవల్లి, ఆంధ్రా విశ్వవిద్యాలయం ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ డి.నాగరాజకుమారి, కుప్పం ద్రవిడ విశ్వవిద్యాలయం విద్యా విభాగం ప్రొఫెసర్ ఎస్.విజయవర్ధిని, గోకవరంలోని హన్నా విద్యా కళాశాల కరస్పాండెంట్ బి.సువర్ణకుమార్, ముక్తేశ్వరంలోని ఎస్‌కేఎం విద్యా కళాశాల ప్రిన్సిపాల్ వైవీ జగన్నాథ్, నర్సాపురంలోని శ్రీజీవీఆర్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్ పి.శాంతి, రాజమహేంద్రవరం ఎస్‌జీఎస్ ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్, మరో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వీరంతా మూడేళ్ల పాటు కొనసాగుతారని చైర్మన్ సుబ్బారావు తెలిపారు. ఈ మేరకు వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ జి.సుధాకర్ నుంచి నియామక పత్రం అందుకున్నట్టు ఆయన చెప్పారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని విద్యా కళాశాలలు మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటామని, విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని చైర్మన్ సుబ్బారావు చెప్పారు.

పట్టభద్రుల ఓటు నమోదు ప్రారంభం

నవంబరు 6 ఆఖరు తేదీ

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదు కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. జిల్లాలో గ్రాడ్యుయేషన్ (డిగ్రీ) పూర్తి చేసుకున్న అభ్యర్థులకు నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. వచ్చే మార్చి నెలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పదవీకాలం పూర్తి కానుండడంతో ఎన్నికలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ఏడాది నవంబరు ఒకటో తేదీకి మూడేళ్ల ముందు డిగ్రీ పూర్తి చేసుకున్నవారు దీనిలో ఓటు నమోదుకు అర్హులుగా పేర్కొన్నారు.



జాతీయ రహదారిపై బోల్తాపడిన ఓ ఉల్లి లోడు లారీ

ఉల్లిపాయల లారీలు బోల్తా

డ్రైవర్లకు తీవ్ర గాయాలు

తుని రూరల్, సెప్టెంబరు 30: కాకినాడ జిల్లాలో 16వ నెంబరు జాతీయ రహదారిపై ఎర్రకోనేరు వద్ద రెండు ఉల్లిపాయల లారీలు ఢీకొన్నాయి. సోమవారం విజయవాడ నుంచి అనకాపల్లి ఉల్లిపాయల లోడ్‌తో వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో ఉల్లిపాయల లారీ బలంగా ఢీకొంది. ఈ ఘటనలో రెండు లారీలు బోల్తాపడగా డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 అంబులెన్సులో ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనాస్థలంలో ఉల్లిపాయలు మూటలు చెల్లాచెదురుగా పడి ఉండడంతో వాటి కోసం స్థానికులు ఎగబడ్డారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అడ్డుకుని ఉల్లిపాయల బస్తాలను మరో లారీలో నింపి తరలించే చర్యలు చేపట్టారు.



జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావుకు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు

'కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి'

మోతుగూడెం, సెప్టెంబరు 30: జెన్‌కోలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు ఆ సంస్థ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావును కోరారు. వారికి 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలన్నారు. పదేళ్లు పూర్తయిన హైస్కిల్డ్ కార్మికుడికి రూ.1,000, స్కిల్డ్ కార్మికుడికి రూ.800, అన్‌స్కిల్డ్‌కి కార్మికుడికి రూ.500 ఇన్సెంటివ్ పెంచాలన్నారు. అప్పర్ సీలేరు జెన్‌కో పరిధిలో ఓఅండ్ఎంలో పనిచేస్తున్న 12 మంది, మోతుగూడెం సివిల్ క్యాంపు, ఫోర్‌బే సెక్షన్‌లో పనిచేస్తున్న ఐదుగురు సిబ్బందిని పీస్ వర్క్ నుంచి మ్యాన్‌పవర్‌గా చేస్తూ ఇచ్చిన ఎస్టిమేట్‌లను అమలు చేయాలన్నారు. జెన్‌కో ఆసుపత్రిలో కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు వైద్య సేవలు అందజేయాలని కోరారు.



ఎన్టీఆర్ ట్రస్టు సేవల ప్రారంభ సభలో మాట్లాడుతున్న మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరి

తోబుట్టువులా ఆదరించారు

- బాధలో ఉన్నప్పుడు ధైర్యమిచ్చారు
- రాజమండ్రి ప్రజలను మరవలేను
- వారికి నా పాదాభివందనాలు
- నారా భువనేశ్వరి
- రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి)/ రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 30: 'నేను, నా కోడలు 53 రోజులు ఇక్కడ ఉన్నాం. ఎంతో బాధతో ఉన్నా ఇక్కడి ప్రజలు ఆదరించి, ధైర్యం ఇచ్చారు. ఇల్లు కూడా ఇచ్చి అండగా నిలబడ్డారు. రాజమండ్రి వాసులు నన్ను తోబుట్టువులా ఆదరించారు. వారిని ఎప్పటికీ మరవలేను. వారందరికీ నా కృతజ్ఞతలు. నా పాదాభివందనాలు' అని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లో డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో నడుస్తున్న గోరంట్ల శాంతారావు (జీఎస్ఆర్) మెమోరియల్ ఫౌండేషన్‌లో ఎన్టీఆర్ ట్రస్టు 4వ బ్లడ్ బ్యాంక్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ తమకు ఆశ్రయమిచ్చి, అండగా నిలిచిన నన్ను ముందుకు నడిపించిన నా కుటుంబ సభ్యులు ఈ ప్రజలు. వారిని తాను ఎప్పటికీ మర్చిపోలేనన్నారు. రాజమండ్రి దాతల గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. రాజకీయాలు తెలియని నాకు ఇక్కడ 'నిజం గెలవాలి' అనే నినాదంతో ప్రజల్లోకి వెళ్లేటట్టు ఈ ప్రజలు ప్రోత్సహించారన్నారు. రాజమండ్రిలో ఉన్నప్పుడు మీడియా ఇచ్చిన సహకారాన్ని మర్చిపోలేమన్నారు. ఈలోపు కొందరు జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు ప్రాధాన్యమివ్వాలని, ఇక్కడ ఇవ్వలేదని చెప్పడంతో తప్పకుండా వచ్చేలా చేస్తామని ఆమె చెప్పారు.

డాక్టర్లతో మాటామంతీ

గోరంట్ల రవిరామ్‌కిరణ్, జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ చైర్మన్ గన్ని భాస్కరరావు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ అగస్త్యరాజు శ్రీనివాసరాజు తదితరులతో ఎన్టీఆర్ ట్రస్టు చేసే సేవలపై భువనేశ్వరి మాట్లాడారు. పేదలకు సేవ చేయడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. అంతకు ముందు ఆమె అంబులెన్స్‌ను, కోలమూరులో మొబైల్ క్లినిక్‌ను ప్రారంభించారు. రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న నందరాడకు చెందిన పూజా ప్రవల్లిక (12), గోకవరానికి చెందిన మహిదికాంత్ (3)లను వారి బంధువులు భువనేశ్వరి వద్దకు తీసుకురాగా వైద్య సహాయ కోసం మాట్లాడారు. ఈ పిల్లలకు పౌష్టికాహారం కిట్లు ఇచ్చి పంపించారు.

ట్రస్ట్ ద్వారా సేవ చేసేది ఎన్టీఆర్ ట్రస్ట్: ఎమ్మెల్యే గోరంట్ల

అనేక రాజకీయ పార్టీలు ఉన్నప్పటికీ, టీడీపీ మాత్రమే ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రజలకు విద్య, వైద్య రంగాల్లో సేవ చేస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా లక్షలాది మందికి ప్రాణదానం చేస్తున్నారన్నారు. భువనేశ్వరి ట్రస్టు ద్వారా అనేక సేవలు చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, సీవో గోపి, జీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు ప్రారంభమయ్యాయి. నారా భువనేశ్వరి స్వయంగా ఇక్కడ బ్లడ్ బ్యాంక్‌ను ప్రారంభించారు. ఇక్కడ బ్లడ్ బ్యాంక్ సేవలందించనున్నారు. ఇక్కడ బ్లడ్, బ్లడ్ కాంపోనెంట్స్ అందుబాటులో ఉంటాయి. హోల్ బ్లడ్ (డబ్ల్యుబి), ప్యాక్ రెడ్‌బ్లడ్ సెల్స్ (పీఆర్‌బీసీ) ర్యాండమ్ డోనర్ ప్లేట్‌లెట్ (ఆర్‌డీపీ), ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్ఎఫ్‌పీ), క్రయో ప్రెసిపిలేట్ (సీఆర్‌వైపీ), సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ (ఎస్‌డీపీ), లికోడిప్లాటెడ్ ప్యాక్ రెడ్‌బ్లడ్ సెల్స్ (ఎల్‌డీపీఆర్‌బీసీ), సెలైన్ వాష్ వంటివి ఇక్కడ లభ్యమవుతాయని డాక్టర్ రవిరామ్‌కిరణ్ చెప్పారు.



బ్లడ్ బ్యాంక్‌ను, అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న భువనేశ్వరి





స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలి

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 30: ప్రజలందరూ స్వచ్ఛతను అలవాటుగా మార్చుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానంలో సోమవారం 'స్వచ్ఛత హి సేవ' నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం జాతిపిత మహాత్మాగాంధీ 151వ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతమైందన్నారు. ప్రజలంతా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, ఇంటిని ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆకాంక్షించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విజన్-2047 కోసం ప్రతి ఒక్కరూ తప్పకుండాతమ వంతుగా అమూల్యమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మానవహారం నిర్మించారు. నగర పాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్, యువతీ, యువకులు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



హుండీల ద్వారా సమకూరిన ఆదాయాన్ని పర్యవేక్షిస్తున్న చైర్మన్ రోహిత్, ఈవో రామచంద్రమోహన్

సత్యదేవుని హుండీల ఆదాయం రూ.78.54 లక్షలు

అన్నవరం, సెప్టెంబరు 30: రత్నగిరివాసుడైన సత్యదేవునికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. 28 రోజులకు రూ.78,54,428 నగదు, 31 గ్రాముల బంగారం, 453 గ్రాముల వెండి సమకూరాయి. యూఎస్ఏ డాలర్లు 800, సౌదీ అరేబియా రియల్స్ 400, ఒమెన్ బైసాలు 600 లభించాయి. సిబ్బంది లెక్కించగా ఈవో రామచంద్రమెహన్, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించారు.





సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ, హాజరైన సైన్స్ ఉపాధ్యాయులు

విద్యార్థులకు అవసరమైన సాంకేతికత అందించాలి

జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, సెప్టెంబరు 30: విద్యార్థులకు అవసరమైన సాంకేతికతను అందించాలని కాకినాడ జేఎన్టీయూ ఇన్‌చార్జి ఉప కులపతి ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ సూచించారు. వర్శిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి, పాఠశాల విద్యా శాఖ, జేఎన్టీయూకే సంయుక్త ఆధ్వర్యంలో 'సైన్స్ బోధనలో నూతన పోకడలు, ఆవిష్కరణలు' అంశంపై రాష్ట్ర స్థాయిలో సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ తరగతులను సోమవారం నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 340 మంది సైన్స్ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఆహ్లాదకరమైన బోధనతో అద్భుతమైన విజయాలు సాధించవచ్చన్నారు. నూతన బోధనా పద్ధతుల ఆవిష్కరణలతో విద్యార్థులను అభ్యసనం పట్ల ఆకర్షించగలమని తెలిపారు. డీఈవో పిల్లి రమేష్, ఏపీ శాస్త్ర, సాంకేతిక మండలి సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్‌వినీల్ మాట్లాడుతూ ఈ శిక్షణ చాలా వినూత్నమైనదన్నారు. 'ప్రాజెక్టు ఆధారిత అభ్యాసం-పరిశోధనా పద్ధతి' అంశాన్ని డాక్టర్ ఎన్.శ్రీనివాస్ వివరించారు. జేఎన్టీయూకే ప్రొఫెసర్ ఎం.రమేష్ సైన్స్‌లో నూతన ఆవిష్కరణలను తెలిపారు. సీఎస్ఈ ప్రొఫెసర్ ఏఎస్ఎన్ చక్రవర్తి సైన్స్ బోధనలో యాప్స్ ఆవశ్యకతను వివరించారు. సైన్స్ విద్యలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడాన్ని డాక్టర్ బాలాజీ తెలియజేశారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా డాక్టర్ ఆలపాటి శ్రీనివాస్, ఎంఈవో సీహెచ్ రవి, సమన్వయకర్తలు రాజారావు, శ్రీనివాస్, కృష్ణారావు, వాకాడ వెంకటరమణ, గోవిందరాజులు పాల్గొన్నారు.



శివ సదన్ కాటేజీపై ఏర్పాటు చేసిన సోలార్ పలకలు

సత్యగిరిపై సోలార్ విద్యుత్ ప్యానల్స్ ఏర్పాటు వేగవంతం

అన్నవరం, సెప్టెంబరు 30: అన్నవరం దేవస్థానం పరిధిలోని సత్యగిరి కొండపై హరిహర సదన్, విష్ణు సదన్, శివ సదన్ కాటేజీలపై సోలార్ విద్యుత్ పలకల ఏర్పాటు ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. సుమారు రూ.3.15 కోట్లతో చేపట్టిన ఈ పనులను దేవదాయ శాఖ మంత్రితో ప్రారంభింపజేయాలని అధికారులు యోచిస్తున్నారు. దీనిద్వారా ఏటా 9లక్షల యూనిట్ల విద్యుత్ సరఫరా ఉత్పత్తి అవుతుందని, 0.6 మెగావాట్ల సామర్థ్యంతో నెడ్‌క్యాప్ సంస్థ పనులు చేపడుతుందని దేవస్థానం విద్యుత్ విభాగం డీఈ విశ్వనాథుల సత్యనారాయణ చెప్పారు.





కాకినాడ డీఎస్ఏ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికల ప్రారంభ సభలో పాల్గొన్న అధికారులు, వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఎంపికలు

కాకినాడ అర్బన్, సెప్టెంబరు 30: రాష్ట్ర స్థాయి పోటీలకు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయి జట్ల ఎంపికను సోమవారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్, రగ్బీ ఆటల్లో నిర్వహించిన పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 3వేల మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్, జేఎన్టీయూకే స్పోర్ట్స్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేష్, కార్యదర్శి, చక్రవర్తి, కాకినాడ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి, ఏవీ శ్రీనివాస్, వి.రవిరాజు పాల్గొన్నారు.

కలెక్టర్ ఫొటోతో వాట్సాప్ డీపీ

డబ్బులు పంపాలని తహసీల్దార్లకు మెసేజీ
అధికారవర్గాల్లో కలకలం
ఫేక్ మెసేజీలు నమ్మవద్దని కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఫొటోతో ఒక అజ్ఞాత వ్యక్తి వాట్సాప్ డీపీ పెట్టుకుని జిల్లాలోని తహసీల్దార్లను డబ్బులు పంపాల్సిందిగా కోరడం అధికార వర్గాల్లో సోమవారం కలకలం రేపింది. జిల్లాలోని తొండంగి, శంఖవరం, ప్రత్తిపాడు తహసీల్దార్లకు డబ్బులు అర్జెంటుగా పంపాలని సంబంధిత వ్యక్తి మెసేజ్‌లు పంపాడు. దీంతో ఆయా తహసీల్దార్లు ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అప్రమత్తమైన ఆయన అలాంటి ఫేక్ మెసేజ్‌లు నమ్మవద్దని ఆదేశాలు ఇచ్చారు. అధికారుల గ్రూపులో కూడా ప్రత్యేకంగా కలెక్టర్ సూచనలు పంపారు. ఫేక్ మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

అక్కడన్నారు... ఇక్కడన్నారు

లంక పొలాల్లో చిరుత పులి కనిపించిందని ప్రచారం
గాలించిన అటవీ శాఖ అధికారులు
జాడ లేదని తేల్చి చెప్పిన కోనసీమ డీఎఫ్‌వో ప్రసాద్

రావులపాలెం, సెప్టెంబరు 30: 'చిరుత సంచారంపై తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల్లో 'గత 25 రోజులుగా గాలిస్తున్నాం... రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని లంక పొలాల్లో చిరుత కనిపించిందంటూ ప్రచారం జరిగింది. మేం వెళ్లి పరిశీలించగా దాని జాడ ఎక్కడా కనిపించలేదు' అని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు తెలిపారు. రావులపాలెంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రావులపాలెం గౌతమి గోదావరి సమీపంలోని లంక పొలాల్లో చిరుతను చూశానని చెప్పిన వ్యక్తితో కలిసి ఆ ప్రాంతానికి పడవలో వెళ్లి గాలించామన్నారు. అక్కడ చిరుత జాడలు కనిపించలేదన్నారు. ఆ మత్స్యకారుడిని పలుమార్లు ప్రశ్నించగా... ముందు దగ్గర నుంచి చూశానని, తర్వాత కదలికలను చూశానని చెప్పాడన్నారు. అక్కడి నుంచి వెళ్లి ఊబలంక పొలాల్లో కూడా చిరుత కోసం అన్వేషించగా జాడ కనిపించలేదన్నారు. 'చిరుత పులి పాదం 8 సెంటీమీటర్లు పైబడి ఉంటుంది. కుక్క పాదం కంటే పెద్దది. కుక్క గోర్లు గుచ్చి నడుస్తుంది. చిరుతపులి పాదం అన్ని నడుస్తుంది. ఇలా అన్ని కోణాల్లో పరిశీలించినప్పటికీ ఈ ప్రాంతంలో ఎక్కడా చిరుత జాడ కనిపించలేదు. అయినా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. లంక ప్రాంతాల్లోకి ఒంటరిగా కాకుండా ఇద్దరు, ముగ్గురు కలిసి వెళ్లాలి... చిరుత ఎదురైనా భయపడాల్సిన పనిలేదు. దానికంటే పెద్దజంతువుల పైన, ఎత్తుగా కనిపించే మనుషులపైన దాడి చేయదు' అని డీఎఫ్‌వో చెప్పారు. తనిఖీల్లో అధికారులు అమరనాథ్, దుర్గా రామప్రసాద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో ప్రసాద్



రావులపాలెం గౌతమి వంతెన వద్ద చిరుత జాడను పరిశీలిస్తున్న అధికారులు



గౌతమి పరివాహక ప్రాంత లంక పొలాల్లో అధికారుల పరిశీలన

కాకినాడ

ఇంగ్లీషు, తెలుగు టైపు రైటింగ్ పరీక్షలు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 30: ఇంగ్లీషు, తెలుగు కేటగిరీలో హైయర్, లోయర్ టైపు రైటింగ్ పరీక్షలు 2రోజులుగా కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. కళాశాల ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగం హెడ్, టైపు రైటింగ్ పరీక్షల జాయింట్ చీఫ్ సూపరింటెండెంట్ వై.ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షించారు. 500మంది హాజరయ్యారు. కాకినాడ సెంటర్ టైపు రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇనిస్టిట్యూషన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు శ్రీనివాస్, అసోసియేషన్ ప్రతినిధులు సహకారం అందించారు.

అధికారులపై కౌన్సిలర్ల ఆగ్రహం

» పలుచోట్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు » ప్రజా సమస్యలపై నిలదీసిన సభ్యులు




సామర్లకోటలో పారిశుధ్య సమస్యపై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు, పెద్దాపురంలో ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్

పెద్దాపురం, సెప్టెంబరు 30: ప్రజా సమస్యలపై మున్సిపల్ అధికారులను పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అధ్యక్షతన సోమవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, ముప్పన శ్యామలాంబ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టిసారించాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లో ఉన్న దుకాణ సముదాయాల అద్దెల విషయంలో రెవెన్యూ అధికారుల తీరు సరిగాలేదన్నారు. దుకాణాల అద్దెల తగ్గింపు విషయంలో తమకు అభ్యంతరం లేదని, 2019-20 పెంచిన అద్దెలను కౌన్సిల్ ఆమోదంతో సవరణ చేస్తే ఇప్పుడు మళ్లీ వాటిని సవరణ చేస్తూ కౌన్సిల్ ముందు ఉంచడం సరైనది కాదన్నారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలన్నారు. కౌన్సిలర్లు ఆకుల కృష్ణబాహూజా, పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో వీధిలైట్లు, పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందన్నారు. పలువిషయాలపై కౌన్సిలర్లు ప్రశ్నించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమీషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ తదితరులున్నారు.

పిఠాపురంలో వాడివేడీగా..

పిఠాపురం, సెప్టెంబరు 30: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అనధికారిక లేఅవుట్లు ఉన్నాయని, కొత్తగా వేస్తున్నా వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలకసంఘ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు వాడివేడిగా జరిగాయి. కౌన్సిలర్లు తలిశెట్టి వెంకటేశ్వరరావు, సోమరౌతు లలిత, బొజ్జా జగదీశ్వరీ, బోనాసుల శివ మాట్లాడుతూ ఇప్పటి వరకూ నాన్ లేఅవుట్లపై ఏమి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషనరు కనకారావు మాట్లాడుతూ మున్సిపల్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని, ఫిష్ ఆంధ్ర దుకాణాన్ని సీజ్ చేయిస్తామని తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పనులు టెండర్ ద్వారా దక్కించుకున్న సూరవరపు దివాణం అనే కాంట్రాక్టర్ పనులు పూర్తిగా చేయకుండా బిల్లులు చేయించుకుంటున్నారని టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్, కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లగా వివరాలు కౌన్సిలర్లకు అందజేస్తానని కమిషనరు హామీనిచ్చారు.

అస్తవ్యస్తంగా పారిశుధ్యం

సామర్లకోట, సెప్టెంబరు 30: పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని సీనియర్ కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ అధికారులపై ధ్వజమెత్తారు. సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం కౌన్సిల్‌హాలు నందు చైర్‌పర్సన్ జీ.అరుణ అధ్యక్షతన నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అపారిశుధ్యం వల్ల అంటురోగాలు ప్రబలే ప్రమాదపరిస్థితులు నెలకొన్నాయన్నారు. మరో కౌన్సిలర్ రెడ్నం సునీత మాట్లాడుతూ తన వార్డులో పారిశుధ్య సమస్యపై 3నెలలుగా అధికారులకు మొత్తుకుంటున్నా ఏ ఫలితం లేకపోయిందన్నారు. తన వార్డులో వరదనీరు బయటకు వెళ్లే మార్గాన్ని శుభ్రం చేయాలని పలుదపాలు కోరుతున్నా మున్సిపల్ సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తున్నారని పాగా సురేష్‌కుమార్ ఆరోపించారు. పనులు సకాలంలో చేపట్టని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసి బ్లాక్ లిస్ట్‌లలో చేర్చాలని కమిషనర్ శ్రీవిద్యను వైస్‌చైర్మన్ జాన్‌మోజెస్ కోరారు. పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

తునిలో సభ్యుల వాకౌట్

తుని రూరల్, సెప్టెంబరు 30: సోమవారం జరిగిన తుని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. మున్సిపల్ మహిళా కౌన్సెలర్ మర్రి సత్యవతి మరణించిన విషయం స్థానిక ఎమ్మెల్యే ఉన్నతాధికారుల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని సభ్యులు ప్రశ్నించారు. అనంతరం సభను వాకౌట్ చేసి వెళ్లిపోగా కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు.

పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతు



గొల్లప్రోలు శివాలయంలో జరిగిన సహస్ర దీపాలంకరణలో పాల్గొన్న తుమ్మల, మర్రెడ్డి

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 30: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలు, మండలాల పరిధిలోని గ్రామాల్లోని ఆలయాల్లో జనసైనికులు, వీరమహిళలు దీపాలు వెలగించారు. పలువురు ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి సంఘీభావాన్ని తెలియజేశారు. గొల్లప్రోలు ప శివాలయంలో సహస్ర దీపాలంకరణ జరిగింది. జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు. పిఠాపురం ఉప్పాడ సెంటర్‌లో ప్రాయశ్చిత్త దీక్షల్లో సోమవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకట సూర్యనారాయణరాజు, గండికొండలరావు, బుర్రి మురళీధరరావు, రవణం సుబ్రహ్మణ్యం, తోట ఏడుకొండలు, వాసంశెట్టి శ్రీనివాస్, పిల్లా ముత్యాలరావు, పసుపులేటి సత్యనారాయణ పాల్గొన్నారు.

కరప: కరపలో వేణుగోపాలస్వామి ఆలయంలో కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు. టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, జనసేన నాయకులు పేకేటి దుర్గాప్రసాద్, చిన్నారి శ్రీను తదితరులున్నారు.

జగ్గంపేట: జగ్గంపేటలో జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రావులమ్మతల్లి గుడి దగ్గర దీపారాధన చేసి కాగడాలతో విష్ణు ఆలయం వరకు ర్యాలీ చేశారు. మేడిబోయిన శ్రీను, సూరంపాలెం బాలు, మా దారపు వీరబాబు, మరిసే రామకృష్ణ, కుంచే కోటి, రాజనాల శ్రీను, కాబోలు స్వామి ఉన్నారు.

నేడు ఓం నమో నారాయణ మంత్ర పఠనం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 30: సనాతన ధర్మ పరిరక్షణ కోసం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చేస్తున్న ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా మంగళవారం గొడారిగుంటలో ఎమ్మెల్యే పంతం నానాజీ నివాసం వద్ద ఓం నమో నారాయణ మంత్ర పఠన కార్యక్రమం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి వందలాది వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఓం నమో నారాయణ మంత్ర పఠనం చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు అధికంగా పాల్గొనాలని ఆయన కోరారు.

'గెలుపే లక్ష్యంగా పనిచేయాలి'

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 30: ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ (పూర్వ అర్బన్ బ్యాంకు) ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఏపీ టిడ్కో చైర్మన్, జనసేన పార్టీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ వేములపాటి అజయకుమార్ పిలుపునిచ్చారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్ నివాసంలో సోమవారం సాయంత్రం అర్బన్ సొసైటీ ఎన్నికలపై జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. సమావేశంలో పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేన మద్దతుతో పోటీలో ఉన్న అర్బన్ సొసైటీ అభ్యర్థులు ఉన్నారు.

'ఎన్టీఆర్ స్ఫూర్తితో అన్న క్యాంటీన్లు'

జగ్గంపేట, సెప్టెంబరు 30: నందమూరి తారక రామారావు స్ఫూర్తితో అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. జగ్గంపేట ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో సోమవారం సింగపూర్ కందుల శివప్రసాద్, కృష్ణకాంతి దంపతుల ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న భోజనాలను నవీన్ ప్రారంభించి పేదలకు వడ్డించారు. కార్యక్రమంలో కొత్త కొండబాబు, వేములకొండ జోగారావు, అడబాల వెంకటేశ్వరరావు, పార్థసారథి, మూర్తి, రామారావు, దేవరపల్లి మూర్తి, యల్లమిల్లి సీఎం, దాపర్తి సీతారామయ్య, వెలిశెట్టి శ్రీను, దేగల సత్తిబాబు, అడబాల పెదబాబు, చిరంజీవి, సందకశంకర్ ఉన్నారు.

'దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు'

సామర్లకోట, సెప్టెంబరు 30: సామర్లకోట రైల్వే స్టేషన్ ఎదురుగా రైల్వే డ్రైన్ వెంబడి కాలువ పక్కన ఎటువంటి ఆక్రమణలను అనుమతించేది లేదని సామర్లకోట రైల్వే అధికారులు హెచ్చరించారు. శాశ్వత ప్రాతిపదికన దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. అమృత్ స్టేషన్స్ స్కీమ్‌లో భాగంగా రూ.15.13 కోట్ల నిధులతో రైల్వే స్టేషన్ భవనాలు నిర్మాణాలు, స్టేషన్ ఆవరణ సైతం బ్యూటీఫికేషన్ చేయాలన్న రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో స్టేషన్ ముందు భాగాన్ని విశాలంగా తీర్చి దిద్దుతామని స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్, ఆర్పీఎఫ్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కృత్రిమ చెయ్యి సమకూర్చిన జనసేన ప్రతినిధి

పిఠాపురం, సెప్టెంబరు 30: రోడ్డు ప్రమాదంలో చేతిని కోల్పోయిన వ్యక్తికి జనసేన ఆస్ట్రేలియా ఎన్ఆర్ఐ ప్రతినిధి కొల్లి శశియాదవ్(శశిధర్) అండగా నిలిచారు. బయోనిక్ ఆర్టిఫిషియల్ హ్యాండ్(కృత్రిమ చేయి)ని సమకూర్చారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన కొండలరావు కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎడమ చేతిని కోల్పోయాడు. ఎన్నికల ప్రచార సమయంలో కొండలరావు తన పరిస్థితిని శశియాదవ్‌కు వివరించగా అండగా ఉంటానని హామీ ఇచ్చి కృత్రిమ చేయిని సమకూర్చారు. దీన్ని పిఠాపురంలో శుక్రవారం కొండలరావుకు ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు

తొండంగి, సెప్టెంబరు 30: తొండంగిలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ పాల్గొని మొక్కలు నాటి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, కొయ్యా రామకేశవ, అరిగెల నర్సింహమూర్తి నేమాల కృష్ణ, బంటుపల్లి అన్వేష్ పాల్గొన్నారు. అలాగే పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమ ఉద్దేశాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ వివరించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 1వ వార్డులో నగర పంచాయతీ కమిషనర్ ఎమ్.సత్యనారాయణ శుభోదయం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్లాస్టిక్ నివారణ, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం, పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నగర పంచాయితీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా నేత్ర పరీక్షలు

ఏలేశ్వరం, సెప్టెంబరు 30: సిరిపురంలో టీడీపీ ఎస్సీ సెల్ స్టేట్ సెక్రటరీ బచ్చల శివ నేతృత్వంతో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర శిబిరాన్ని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ప్రారంభించారు. రాజమహేంద్రవరం గౌతమీ నేత్రాలయం డాక్టర్ రమేష్ సుమారు 132 మందికి నేత్ర పరీక్షలు న్విహించి, 28 మందికి ఉచితంగా కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. 16 మందిని ఆపరేషన్ నిమిత్తం గౌతమీ నేత్రాలయానికి పంపించారు. సర్పంచ్ పీతల నూకరాజు, ఓనుం మంగ, జ్యోతుల పెదబాబు, కాకల జార్జి,పెంటకోట శ్రీదర్ ఉన్నారు.

'విద్యార్థుల పాత్ర కీలకం'

కోటనందూరు, సెప్టెంబరు 30: అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర కీలకమని చైతన్య గోదావరిబ్యాంక్ డైరెక్టర్ డి.శివబాబు అన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పరిషత్ హైస్కూల్ నందు కోటనందూరు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ భాస్కర్, స్కూల్ కమిటీ చైర్మన్ చంద్రశ్రీను, డాక్టర్ యామిని పాల్గొన్నారు.

కాపు సంఘం గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాస్

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 30: జాతీయ కాపు సంఘం కాకినాడ జిల్లా గౌరవాధ్యక్షుడిగా పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన బసవా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు కె.మురళీకృష్ణంనాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు ఆమంచి స్వాములు ద్వారా నియమాక ఉత్తర్వులు అందుకున్నారు. కాపు, బలిజ,ఒంటరి తదితర కులాల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

శంఖవరం, సెప్టెంబరు 30: మండలంలో కత్తిపూడి శివారులో పేకాడుతున్న నలుగురిని అన్నవరం పోలీసులు అరెస్టు చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రూ.4500 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ కిషోర్ తెలిపారు.

నూతన అధికారులు బాధ్యతల స్వీకరణ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 30: ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐగా శివప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడ నుంచి బదిలీపై ఇక్కడ విధుల్లోకి చేరారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎల్.చిరంజీవి అమలాపురం బదిలీ అయ్యారు. ప్రత్తిపాడు ఎస్ఐగా ఎస్.లక్ష్మీకాంతం సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ దిశపోలీస్ స్టేషన్ ఎస్ఐగా పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ప్రత్తిపాడు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్ఐ పనిచేసిన ఎం. పవన్‌కుమార్ ఎస్‌బీకి బదిలీపై వెళ్లారు.

కాకినాడ క్రైం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కాకినాడ నార్త్‌స్టేషన్ సీఐగా కె.రామ్మోన్‌రావు ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన గుడివాడ నుంచి ఇక్కడకు వచ్చారు. నాటుసారా, అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేస్తానన్నారు.

కాకినాడ రూరల్: రూరల్ మండలం ఇంద్రపాలెంలోని కాకినాడ సౌత్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ నూతన సీఐగా టి.నిరంజన్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసాపురం స్టేషన్ నుంచి సాధారణ బదిలీపై ఈస్టేషన్‌కు రాగా, గతంలో కోరుకొండ, రామచంద్రపురం స్టేషన్లలో పనిచేసారు. స్టేషన్ సిబ్బంది అభినందించారు.

కరప: కరప ఎస్ఐగా టి.సునీత బాధ్యతలు స్వీకరించారు. ఏఎస్ఐలు ప్రసన్నకుమార్, సూరిబాబు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

తాళ్లరేవు: తాళ్లరేవు తహశీల్దార్‌గా పితాని త్రినాదరావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మురమళ్ల వెళ్లి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తాళ్లరేవు ఎక్సైజ్ సీఐగా కె.కోటేశ్వర్ బాధ్యతలు చేపట్టారు.

పెద్దాపురం: పెద్దాపురం మోటార్ వెహికల్ ఇనస్పెక్టర్‌గా కె.ప్రసాద్ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటివరకూ పనిచేసిన విఠల్ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రసాద్ ఇక్కడకు వచ్చారు.

'కాపుల సంక్షేమమే ధ్యేయం'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 30: కాపుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యమని జాతీయ కాపు సంఘం అధ్యక్షుడు కర్ణ మురళీ కృష్ణనాయుడు అన్నారు. కాకినాడలో జరిగిన జాతీయ కాపు ఆత్మీయ సమావేశంలో కృష్ణనాయుడు మాట్లాడుడూ తెలంగాణ తరహాలో ఆంధ్రలో కూడా కాపు భవనానికి భూమి కేటాయించి కాపు యువతకు కోచింగ్ సెంటర్ వసతి సౌకర్యం, ఉద్యోగ, ఉపాధి సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆమంచి సోములు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం కాపులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. డీకే చైతన్య, తుమ్మల పద్మజ, ముత్యాల రామదాసు, జానపాముల నాగబాబు, సుంకర శ్రీనివాస్, మలకల చంటి, ఆకుల గజేంద్రప్రసాద్, వి.రవిచంద్ర పాల్గొన్నారు.

'వలంటీర్లను కొనసాగించాలి'

కలెక్టరేట్ (కాకినాడ), సెప్టెంబరు 30: రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లను కొనసాగించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించి జేసీ రాహుల్‌మీనాకు వినతిపత్రం అందించారు. ఏపీ గ్రామ, వార్డు వలంటీర్ల యూనియన్ నాయకులు రమేష్, నాగలక్ష్మి, సంతోషిణి, వరుణ్‌కుమార్ మాట్లాడారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా కోశాధికారి రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు వెంకటరమణ పాల్గొన్నారు.

ముగిసిన డీఎస్సీ ఉచిత కోచింగ్

జగ్గంపేట రూరల్, సెప్టెంబరు 30: జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీఎస్సీ, టెట్ విద్యార్థులకు ఆగస్టు 2నుంచి జరిగిన ఉచిత కోచింగ్ ముగిసింది. జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ టెట్ పరీక్ష అయిన వెంటనే మళ్లీ నిరంతరాయంగా కోచింగ్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రఘురామరాజు, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కొత్తపల్లి, సెప్టెంబరు 30: వాకతిప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి సోమవారం పదవీ విరమణ చేసిన దడాల సుబ్బారావును ఎస్టీయూ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎస్టీయూ కొత్తపల్లి మండలాధ్యక్షుడు పెనుమల్లు ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి లలితకుమారి, సీనియర్ నాయకులు డి.వెంకటరావు, డి.అప్పలరాజు, రాష్ట్ర ఉపాధ్యాయవాణి కన్వీనర్ జేకేశేఖర్, గ్రామస్తులు, నాయకులు సుబ్బారావుకు దుశ్శాలువా కప్పి సత్కరించారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, సెప్టెంబరు 30: మాసశివరాత్రిని పురస్కరించుకుని సోమవారం సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో విశేష పూజలు చేశారు. అధికారుల ఆధ్వర్యంలో పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామికి విశేష అభిషేక పూజలు, పుష్పార్చన పూజలు, బాలత్రిపురసుందరికి విశేష పుష్పార్చన పూజలు చేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు : ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 30: శరన్నవరాత్రి ఉత్సవాలను బాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టామని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ కళ్యాణ మండపంలో సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాటాడుతూ అక్టోబరు 3 నుంచి 12 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరి మాట్లాడుతూ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు జరుగుతాయన్నారు. దేవదాయశాఖ ఆర్‌జేసీ కె.సుబ్బారావు మాట్లాడుతూ 10రోజులపాటు జరిగే ఉత్సవాల కోసం ప్రత్యేకంగా సిబ్బందిని నియమించామన్నారు. సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నాయకుడు సంగిశెట్టి అశోక్ పాల్గొన్నారు.

ఉత్సవాలకు అన్ని విధాలా సహకారం : ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 30: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. సోమవారం 50వ డివిజన్ రాజేంద్రనగర్‌లో గల కనకదుర్గాదేవి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాల సక్రమ నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆలయ కమిటీ, అధికారులు, పోలీసులకు సూచనలు చేశారు. డివిజన్ మాజీ కార్పొరేటర్ పలివెల త్రిమూర్తులు ఉన్నారు.

సత్యదేవుడికి జన్మనక్షత్ర పూజలు

అన్నవరం, సెప్టెంబరు 30: రత్నగిరివాసుడైన సత్యదేవుడి జన్మనక్షత్ర మఖ సందర్భంగా సోమవారం మూలవరులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేకువజామున 2గంటలకు స్వామి,అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి అభ్యంగనస్నానమాచరింపచేశారు. మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి విశేష అర్చనలు గావించారు. స్వామి,అమ్మవార్లు, శంకరుడు ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

వెండి కిరీటం బహూకరణ



ఆలయంలో వెండి కిరీటం అందజేస్తున్న దృశ్యం

పోర్టుసిటీ(కాకినాడ), సెప్టెంబరు 30: నగరంలోని బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వస్వామి దేవాలయంలో అమ్మవారికి సర్పం ఆకారంతో కూడిన వెండి కిరీటాన్ని బహూకరించారు. దేవాలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, ఆలయ ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరిలకు సోమవారం దీన్ని అందజేశారు. నగరానికి చెందిన భక్తులు బాలిశెట్టి సతీష్, అనూష దంపతులు 2కిలోల5గ్రాముల వెండితో తయారుచేయించిన రూ.2లక్షల30వేల విలువైన కిరీటాన్ని అందించినట్టు ఈవో తెలిపారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

సామర్లకోట, సెప్టెంబరు 30: సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాకినాడ ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఆర్వోవాటర్ ప్లాంట్‌ను ఏర్పాటుచేసి ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.వుల్లయ్యల సమక్షంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ప్రసూనకు ఓఎన్‌జీసీ అధికారులు షాదబ్ అన్వార్, రవీంద్రనాద్ అందజేశారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం మీనామాధురి, టీచర్లు జ్యోతి, రామనారాయణ పాల్గొన్నారు.

'ప్రతీ సమస్యకు సత్వర పరిష్కారం'

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 30: డయల్ యువర్ కమిషనర్‌కు ఫోన్‌లో తెలిపిన సమస్యలతోపాటు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా వచ్చిన ప్రతీ సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను ఆమె నిర్వహించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా వివిధ సమస్యలపై 19మంది ఫోన్ చేశారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో 25 అర్జీలు స్వీకరించారు. అడిషనల్ కమిషనర్ సుధాకర్,డిప్యూటీ కమిషనర్ మనోహర్ పాల్గొన్నారు.

'అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి'

పెద్దాపురం, సెప్టెంబరు 30: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అధికారులను ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె ప్రజలనుంచి అర్జీలను స్వీకరించారు. రైతు సంఘం నేత పుట్టా సోమన్న చౌదరి ఆధ్వర్యంలో రైతులు చాగల్నాడు కాలువ ఆక్రమ పూడ్చివేతపై ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కార్యాలయ ఏవో మాధవరావు,పలుశాఖాధికారులు పాల్గొన్నారు.

'రేషన్‌షాపు ఏర్పాటు చేయండి'

రౌతులపూడి, సెప్టెంబరు 30: మా గ్రామంలో రెండో రేషన్ షాపు ఏర్పాటుచేయాలని పారుపాక గ్రామస్తులు యు.నాగేశ్వరావు, కాకర జయరాజు, పి.రమణ, చీకల అప్పారావులు సోమవారం గ్రీవెన్స్‌లో ఇన్‌చార్జ్ తహశీల్దార్ పివివి సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతరేషన్ డీలర్ కావాలనే తక్కువ కార్డులు ఉన్నట్టు మీ దృష్టికి తీసుకువచ్చారని అధికారులు స్పందించి విచారణ చేసి రెండోషాపు ఏర్పాటు చేయాలన్నారు.

200 మొక్కలు నాటేందుకు శ్రీకారం

కిర్లంపూడి, సెప్టెంబరు 30: ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన 200 కొబ్బరి మొక్కలను సోమవారం కిర్లంపూడి ఎస్సీ, బీసీ, ఓసీ శ్మశాన వాటికలో నాటేందుకు శ్రీకారం చుట్టారు. సర్పంచ్ గుడాల శ్రీలత చేతుల మీదుగా మొక్కలు నాటారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, జిల్లా నాయకుడు తూము కుమార్, కుర్ల చినబాబు, ఎంపీటీసీ సాదె కుమారి మాట్లాడుతూ మొక్కలు పెంపకం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని, కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కట్టు నాని, బర్రె ఏసబ్బాయి, టీపీ సునీత ఉన్నారు.

శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదు : యనమల

తుని రూరల్, సెప్టెంబరు 30: శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదని ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించవద్దని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు పోలీసులకు సూచించారు. తేటగుంట క్యాంపు కార్యాలయంలో తుని పట్టణ,రూరల్ సీఐలతో సమీక్ష నిర్వహించారు. అయాయకులపై బెదిరింపులకు పాల్పడిన దౌర్జన్యాలు చేసింది ఎంతటి వారినైనా శిక్షించాలని, అలాగే గంజాయి మూలాలు కనిపిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ పేకాట స్థావరాలు ఉండకూడదని, గుండాటా వంటి జూదాలు పూర్తిగా కట్టడి చేయాలని పోలీస్ యంత్రాంగాన్ని ఆదేశించారు.

యనమలను కలిసిన సబ్ రిజిస్ట్రార్

యనమల రామకృష్ణుడుని తుని నూతన సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన టి.సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యినిగంటి సత్యనారాయణ,మాజీ కౌన్సెలర్ కుక్కుడుపు బాలాజీ తదితరులున్నారు.

1,2 తేదీల్లో పుణ్యక్షేత్రాలకు పయనం : ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 30: అక్టోబరు 1,2 తేదీల్లో తిరుమల, అరుణాచలం పుణ్యక్షేత్రాల సందర్శనకు కుటుంబ వ్యాప్తంగా తరలివెళ్తున్నందున తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజెప్పేందుకు ఎవరూ అచ్చంపేటలోని తన స్వగృహానికి తరలిరావద్దని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం తెలిపారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి అధికారులు పింఛన్ల పంపిణీ చేయనున్నందున ఆయా వార్డులు, గ్రామాల్లో నియోజకవర్గ టీడీపీ నాయకులు అధికారులతో కలిసి పాల్గొనాలని సూచించారు.

నారా భువనేశ్వరికి అభినందన

ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీపాన సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాజమండ్రి విమానాశ్రయం చేరుకోగా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప స్వాగతం పలికి అభినందించారు. ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్ ఉన్నారు.

ఐకమత్యంగా పని చేద్దాం : ఎమ్మెల్యే

ప్రత్తిపాడు, సెప్టెంబరు 30: కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకాన్ని, విశ్వాసాన్ని మరింత పెంపొందించే విధంగా ప్రజా సమస్యల పరిష్కారంలో అందరూ ఐకమత్యంగా కలిసి పని చేద్దామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి రూ.12కోట్లు, 85 అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు రూ.28 లక్షలు నిధులు మంజూరైనట్టు తెలిపారు. సమావేశంలో టీడీపీ పార్లమెంటరీ కోఆర్డినేటర్ శివశంకర్, టీడీపీ నాయకులు కొమ్ముల కన్నబాబు, పర్వత సురేష్, వెన్నా శివ, ఉల్లి వీరభద్రరావు, పైలా సాంబశివరావు, బద్ది రామారావు, ఎంపీపీలు గొల్లపల్లి బుజ్జి, గంటుమళ్ళ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.